ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొన్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాబాద్, ఏప్రిల్ 21: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం సోలీపేట్ గ్రామంలో బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ పొన్న జయమ్మ, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేశ్, మహేందర్‌రెడ్డి, నరేందర్, విఠల్ పాల్గొన్నారు.

తారామతిపేటలో ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 21: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తారామతిపేట గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జోడిమెట్ల వీడీఆర్ రెసిడెన్సీలోని నీలిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత సేవలు అందించారు. 364 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నా రు. కార్యక్రమంలో హాస్పిటల్ సీవోవో నీలి మా, ఆర్గనైజర్ భరత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు వెంకటేశ్ యాదవ్, మహేశ్‌గౌడ్, గొశిక నర్సిం హ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

మంచాల, ఏప్రిల్ 21 : మంచాల మండలం చాంద్‌ఖాన్ గూడ గ్రామంలో సీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం మాజీ సర్పంచ్ నౌసు హరిప్రసాద్, కాళ్ల నర్సింహ్మలతో కలిసి ప్రాంభించారు. గ్రామ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గొడుగు రాధిక, ఆర్గనైజర్లు గొడుగు మల్లేశ్, గంట ఆనంద్ , గొడుగు శ్రీకాంత్, మాదం నరేందర్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

అనాథల విద్యార్థులను ఆదుకోవాలి

అనాథ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న రవి కుమార్, లింగారెడ్డి

ఆర్కేపురం, ఏప్రిల్ 21 : దాతలు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని కెనరా బ్యాంక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లింగారెడ్డి అన్నారు. సరూర్‌నగర్‌లోని ఆదరణ అనాథ ఆశ్రమంలోని 10వ తరగతి విద్యార్థులకు కెనరా బ్యాంక్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.69,500లను అందజే శారు. అనంతరం భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజం లోని అనాథ విద్యార్థులకు సహాయసహకారాలు అందించాలని కోరారు. కె.సురేందర్, విశ్వనాథ్, ప్రసాద్, అనిల్‌కుమార్, మనోజ్, భరత్ కుమార్, రాజునాయక్, ఆదరణ నిర్వాహకుడు జాడి మాధవరావు పాల్గొన్నారు.

సీడ్స్ సైంటిస్ట్ గ్యాంబ్లింగ్.. 15 మంది అరెస్టు

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ)/మేడ్చల్ : ఉన్నతమైన ఉద్యోగంలో ఉండి, దురాశతో గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్న ఒక సీడ్స్ సైంటిస్ట్ సహా 15 మందిని సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.53,510తో పాటు రూ.61,620విలువజేసే గ్యాంబ్లింగ్ కాయిన్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్– మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన పేగినేని రాజేశ్ (40) ఓ సీడ్స్ కంపెనీలో సీనియర్ సైంటిస్ట్. ఆయన గత మూడేండ్లుగా స్థావరాలను మారుస్తూ.. పెద్ద ఎత్తున ప్రొఫెషనల్ గ్యాంబ్లింగ్ నిర్వహిస్తూ, అక్రమ సంపాదనకు అలవాటు పడ్డాడు. గ్యాంబ్లింగ్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరి వద్ద నుంచి ఒకరోజు అడ్వాన్స్‌గా రూ.20వేలు తీసుకుని, వాటికి బదులుగా గ్యాంబ్లింగ్ ప్లాస్టి క్ కాయిన్స్ ఇస్తాడు. ఒక రోజులో 50 వరకు గేమ్స్ నిర్వహించే నిందితుడు, ప్రతి గేమ్‌కు వెయ్యి రూపాయలు చొప్పున ఆర్గనైజర్ కమీషన్ వసూలు చేశాడు. గత కొన్ని రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా కండ్లకో య టీచర్స్ కాలనీలోని ఫ్లాట్‌నం. 12లో పెద్ద ఎత్తున గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు కండ్లకోయ, టీచర్స్ కాలనీలోని ఫ్లాట్ నం.12పై దాడులు జరిపి, గ్యాంబ్లింగ్ నిర్వాహకుడైన రాజేశ్‌తో పాటు మరో 14 మందిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.53,510 నగదుతో పాటు మొత్తం రూ. 1.80లక్షల విలువజేసే సొత్తును స్వాధీ నం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమి త్తం కేసును మేడ్చల్ పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మియాపూర్, ఏప్రిల్ 21 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కూకట్‌పల్లి ఎల్లమ్మబండకు చెందిన రమేశ్ కంబ్లే (53) కూలీ. ఆదివారం ఉదయం అతడు మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా నిజాంపేట వైపు నుంచి మియాపూర్ వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి రమేశ్‌ను ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రమేశ్ కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కృష్ణా నీరు తరలింపు సవాలే

- సాగర్‌లో 507 అడుగుల మేర నీటి నిల్వలు
- 500 అడుగులకు పడిపోతే..ఇబ్బందే
- జూలై దాటితే బార్జ్ టెక్నాలజీతో రెండో విడుత పంపింగ్.. అధికారుల వెల్లడి
- సకాలంలో వరదలు ప్రారంభం కాకపోతే నగర తాగునీటిపై తీవ్ర ప్రభావం

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ ప్రజల దాహార్తిలో ముఖ్యభూమిక పోషిస్తున్న కృష్ణా జలాలను ఎత్తిపోతల ద్వారా నగరానికి రోజూ 270 ఎంజీడీలు (మిలియన్ గ్యాలన్ పర్ డే) నీటిని జలమండలి అందిస్తున్నది. కృష్ణా బేసిన్‌లో ఈ ఏడాది సరైన వరద నీరు లేదు. శ్రీశైలం, సాగర్ కలిసినా 12.86 టీఎంసీల నీటి కొరత ఏర్పడింది. దీనికి తోడుగా రెండు రాష్ట్రాల నీటి అవసరాలు... ముఖ్యంగా ఏపీ ధోరణితో ప్రస్తుతం సాగర్‌లో 507 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో సాగర్ నీటి నిల్వ 524 అడుగుల మేర ఉండగా..ఈ సారి నీటి మట్టం డెడ్ స్టోరేజ్ చేరింది. ఈ ప్రభావం హైదరాబాద్ తాగునీటిపై పడకుండా ఉండేందుకు ఏడేండ్ల తర్వాత జలమండలి అత్యవసర పంపింగ్‌కు రూ. 3 కోట్లు ఖర్చు చేశారు. సాగర్ ఫోర్‌షోర్‌లో 10 అత్యవసర మోటర్లు (స్టాండ్ బై 4 మోటర్లు)ఏర్పాటు చేసి, నగరానికి రోజూ మూడు దశల్లో 270 ఎంజీడీల (మిలియన్ గ్యాలన్ పర్ డే) చొప్పున నీటిని తరలిస్తున్నారు.

పుట్టగండి అప్రోచ్ కెనాల్ ద్వారా..

సాగర్ జలాశయంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి పుట్టగండి అప్రోచ్ కెనాల్ ద్వారా దాదాపు 9.2 కిలోమీటర్ల మేర నీటిని పంపు చేసి.. అక్కంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తున్నారు. అక్కంపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 1.5 టీఎంసీ (అంటే నెలకు సరిపడా నీటి నిల్వ) ఉండగా, ప్రస్తుతం 1 టీఎంసీల మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలోనే సాగర్ నీటి నిల్వల అంశానికి వస్తే 500 అడుగుల వరకు ఇప్పుడున్న పంపింగ్‌కు ఎలాంటి ఢోకా లేదు. 12 టీఎంసీల మేర నీరు ఉన్నప్పటికీ లాసెస్ (మండుతున్న ఎండలతో నీటి ఆవిరి, ఇతర)పోతే 9 టీఎంసీల మేర నగర తాగునీటి అవసరాలకు వాడుకోవచ్చు.

జూలై చివరి నాటికల్లా..

మిషన్ భగీరథతో పాటు నగర తాగునీటికి నెలకు 1.5 టీఎంసీల నీటిని వాడితే ఐదు నెలలకు పైబడి నగర తాగునీటికి ఎలాంటి ఢోకా ఉండదని అధికారులు చెబుతున్నప్పటికీ జూలై చివరి నాటికల్లా 500 అడుగుల లోపు నీటి నిల్వలు పడిపోతే బార్జ్ టెక్నాలజీని ఉపయోగించి రెండో విడతగా అత్యవసర పంపింగ్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇందుకు రెండు నెలలకు ముందస్తుగానే ఈ పంపింగ్ ఏర్పాట్లు చేస్తామని పేర్కొంటున్నారు. మొత్తంగా తొమ్మిది టీఎంసీలలో 6 టీఎంసీల నీటి తరలింపులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని, ఆ తర్వాతనే నీటి తరలింపు మరింత కష్టసాధ్యమవుతుందన్న వాదనల నేపథ్యంలో జూలై, ఆగస్టు మాసంలో కృష్ణా జలాల తరలింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా నాగార్జునసాగర్‌కు జూలై, ఆగస్టుల్లో వరదలు వచ్చే అవకాశాలుంటాయి. ఈ సారి కొంచెం ఆలస్యమైతే పరిస్థితి ఏమిటన్న దానిపై ఆందోళన నెలకొన్నది. రెండో విడత అత్యవసర పంపింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమిస్తారన్నది చూడాలి.

నిటికి కృష్ణా జలాల తరలింపులా..

- గ్రేటర్‌కు 138 కి.మీ దూరంలో ఉన్న అక్కంపల్లి జలాశయం నుంచి నిత్యం మూడు దశల పంపింగ్ ద్వారా 270 మిలియన్ గ్యాలన్ల కృష్ణా జలాలను రాజధానికి తరలిస్తున్నారు.
- అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 34 కి.మీ దూరంలోని కోదండాపూర్‌కు గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను తరలిస్తున్నారు. అక్కడ శుద్ధి చేసి 353 మీటర్ల ఎత్తున లిఫ్టు ద్వారా నాసర్లపల్లికి పంపింగ్ చేస్తున్నారు. అక్కడి నీటిని శుద్ధి చేసి 495 మీటర్ల ఎత్తున లిఫ్టు చేసి.. 20 కి.మీల దూరంలో ఉన్న గోడకండ్ల రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు.
- గోడకండ్ల రిజర్వాయర్ నుంచి 618 మీటర్ల ఎత్తున లిఫ్టు చేసి 31 కి.మీ దూరంలో ఉన్న గున్‌గల్ మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు... అక్కడి నుంచి 29 కి.మీ దూరంలో ఉన్న సాహేబ్‌నగర్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాలను తరలిస్తున్నారు. అక్కడి నుంచి రింగ్ మెయిన్ పైపులైన్ల ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాలకు నీటిని అందిస్తున్నారు. పాతనగరంతో పాటు ఎల్బీనగర్, రాజేంద్రనగర్, ఉప్పల్, మలక్‌పేట, మహేశ్వరం, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాలు లబ్ధిపొందుతున్నాయి.

సరిగ్గా ఏడేండ్ల తర్వాత ..

నాగార్జున సాగర్ నుంచి అత్యవసర మోటర్ల ద్వారా నగరానికి నీటి తరలింపు జలమండలికి కొత్తేమి కాదు..కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టిన సందర్భంలో సాగర్ నుంచి అత్యవసర పంపింగ్ ద్వారా అక్కంపల్లికి.. అక్కడి నుంచి కోదండపూర్ ..నాసర్లపల్లి, గోడకొండ్ల..గునగల్..సాహేబ్‌నగర్ వరకు కృష్ణా జలాలను మూడు దశల్లో నగరానికి రోజూ 270 ఎంజీడీలను చేర్చుతున్నారు. అక్కంపల్లిలో 1.5 టీఎంసీల నీరు స్టోరేజీ నిత్యం ఉంచుతారు. నీటి తరలింపులో ఎలాంటి పరిస్థితులు ఉన్నా...అక్కంపల్లిలో నిల్వ ఉన్న నీరు నెల రోజుల వరకు సరిపోతుంది. అయితే అత్యవసర తరలింపు ప్రక్రియ సరిగ్గా 2017 లో దాదాపు 120 రోజుల పాటు నడిపించారు. ప్రస్తుతం అత్యవసర పంపింగ్‌లో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, ప్రత్యేక సబ్‌స్టేషన్లతో విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసిన మైనార్టీ నాయకులు

ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 21 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులకు బుద్ధి చెప్పి, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం మైనార్టీ నాయకులు ఎండీ దావుద్, రంగారెడ్డి జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఎంఏ షమీర్, తదితరులు ఎమ్మెల్యేను కలిసి.. చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌కు సంఘీభావం ప్రకటించారు. కాసాని గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గం మైనార్టీలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. తనను గెలిపించిన మాదిరిగా అభ్యర్థి కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో గెలువడానికి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని కోరారు. నాయకులను, మాజీ సర్పంచ్‌లను, కౌన్సిలర్లను కాంగ్రెస్ అభ్యర్థి లొంగదీసుకోవాలని చూస్తున్నారని.. వారి ఆటలను సాగనివ్వమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఎండీ సర్వర్, మండల మైనార్టీ నాయకులు నిహాల్ అహమ్మద్, ఇమ్రాన్, నవాస్, అఫ్రోస్, మతిన్, ఖాదర్, తబ్రేస్‌లు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వీరంగం

- హెచ్‌సీయూ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలి
- ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ) : సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన ఘర్షణపై పూర్తిస్థాయి విచారణ జరిపి దాడిచేసిన ఏబీవీపీ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు శివదుర్గా రావు, హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతీక్, యూనిట్ కార్యదర్శి కృపాజార్జ్, విద్యార్థులు, దాడిలో గాయపడిన విద్యార్థులు మెహిత్, ఆషిక, ఖాయినీ, ఫైజల్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 13వ తేదీ ఎకానామిక్స్ డిపార్మెంట్స్ ఫేర్వెల్ పార్టీ జరుగుతున్న సందర్భంలో ఏబీవీపీకి చెందిన వారు మద్యం మత్తులో అల్లరి చేస్తూ పాటల విషయంలో గొడవ చేస్తుంటే విద్యార్థులు అడ్డుకున్నారన్నారు. దీంతో కోపం పెంచుకున్న ఏబీవీపీ విద్యార్థులు 17వ తేదీన మైనారిటీ వర్గానికి చెందిన ఫైజల్ అనే విద్యార్థిపై విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. జేఎన్‌టీయూలో నబీబ్ అదృశ్యమైన ఘటన తెలిసిందే.. అలా నిన్ను అదృశ్యం చేస్తామని బెదిరింపులకు గురి చేశారని మండిపడ్డారు. విద్యార్థినులను సైతం లైంగిక వేదింపులకు గురిచేశారని తెలిపారు. 10మంది విద్యార్థులను తీవ్రంగా గాయపర్చడంతో పాటు వారిని తీసుకెళ్తున్న అంబులెన్స్‌పై సైతం దాడికి యత్నించారని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు తెలుపగా.. ఇరు వర్గాల మధ్యన ఘర్షణగా చిత్రీకరిస్తూ బైండోవర్ చేస్తున్నారని వాపోయారు. పోలీసులు నిష్పక్షపాత విచారణ జరిపి దాడి చేసిన దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జూనుగరి రమేశ్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు స్టాలిన్, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

విచారణ జరిపి దోషులను శిక్షించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గత వారం రోజులుగా ఏబీవీపీ నాయకత్వంలో మూకదాడులు చేస్తున్నారని, ఏడుగురు విద్యార్థినులతో సహా 20 మంది విద్యార్థులు వీరి దాడిలో గాయపడ్డారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఈ దాడులను భారత కమ్యూనిస్టు పారీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు తక్షణం విచారణ జరిపి దోషులను శిక్షించాలని, విద్యార్థులకు భద్రత కల్పించాలని తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

షాద్‌నగర్, ఏప్రిల్ 21: గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నందిగామ మండల కేంద్రానికి చెందిన గోపు మల్లేశ్ (23) సొంత పనుల నిమిత్తం బైకుపై షాద్‌నగర్–కేశంపేట బైపాస్ రోడ్డు వద్దకు వచ్చాడు. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మల్లేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 21: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు పాండు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తుందన్నారు.

నమ్మకండి.. అనుమానించండి

- క్రెడిట్ బిల్లులో రాయితీ అంటూ ఫోన్లు
- వివరాలు తీసుకొని..
- డబ్బులు స్వాహా
- కొత్త మోసానికి తెరలేపిన సైబర్ చీటర్స్

సిటీబ్యూరో, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): 'మేం క్రెడిట్ కార్డు కాల్‌సెంటర్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ క్రెడిట్ కార్డుకు సర్వీస్ చార్జీలు.. బిల్లులో రాయితీ ఇస్తున్నాం.. ఈ అవకాశాన్ని వాడుకోండి.. నెలవారి బిల్లు తగ్గుతుంది.. మీరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలంటే ఈ కింద లింక్‌ను క్లిక్ చేసి, వివరాలను పొందుపరచండి'.. అంటూ కొత్త తరహా మోసాలకు తెరలేపుతున్నారు సైబర్‌నేరగాళ్లు. నెలవారీ బిల్లులో నిజంగానే తగ్గుతుందనే ఆశతో క్రెడిట్ కార్డుదారు నేరగాళ్లు సూచించిన లింక్‌ను క్లిక్ చేస్తూ.. మోసపోతున్నారు.

నకిలీ వెబ్‌సైట్..

సైబర్‌నేరగాళ్లు రోజుకో కొత్త తరహా పంథాతో ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ మోసాల్లో ఒకటి క్రెడిట్ కార్డు రాయితీ. దీని కోసం నకిలీ వెబ్‌సైట్లను తయారు చేసి, ఆ లింక్‌లను బాధితులకు పంపిస్తున్నారు. వాటిపి క్లిక్ చేయగానే ఒక వైపు బ్యాంకు పేరు కూడా కనిపిస్తుంది. దీంతో, ఆ లింక్‌లోని మెసేజ్ నిజమేనని బాధితులు నమ్ముతున్నారు. 'ఆ లింక్ క్లిక్ చేసి మీ వివరాలు పొందుపర్చండి'.. అంటూ నేరగాళ్లు సూచిస్తున్నారు. దీంతో బాధితులు క్రెడిట్‌కార్డు, సీవీవీల నంబర్లను కూడా అందిస్తున్నారు. ఆ సమయంలో ఓటీపీ కూడా వస్తుంది. అయితే ఓటీపీ ఇచ్చే సమయంలో కొందరు అనుమానించి..మోసాన్ని గుర్తిస్తున్నారు. మరికొందరు మాత్రం ఓటీపీని కూడా చెప్పేస్తున్నారు. ఇలా ఓటీపీ చెబితే.. ఆ క్రెడిట్ కార్డు మొత్తం సైబర్‌నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఓటీపీ చెప్పే వరకు ఆ క్రెడిట్ కార్డు లిమిట్ ఎంత అనే విషయాన్ని కూడా తెలుసుకుంటున్నారు. మీకు ఈ నెల క్రెడిట్ కార్డు బిల్లు ఎంత వచ్చిందనే విషయాన్ని నేరుగా బాధితులను అడిగి తెలుసుకుంటున్నారు.

రూ.2 లక్షలు స్వాహా

నగరానికి చెందిన ఓ వ్యాపారికి క్రెడిట్ కార్డు నెలవారీ బిల్లులో తగ్గింపు ఇస్తున్నామంటూ ఫోన్ చేశారు. ఆయన వారి మాటలు నిజమని నమ్మాడు. వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగానే ప్రైవేట్ బ్యాంకు పేరుతో ఒక వెబ్‌సైట్ పేజీ ఓపెన్ అయ్యింది. అందులో ఒక ఫామ్ ఇచ్చి, వివరాలు పొందుపరచాలంటూ.. నేరగాళ్లు సూచించారు. దీంతో బాధితుడు తన వద్ద ఉన్న క్రెడిట్‌కార్డు వివరాలను అందించాడు. ఓటీపీ కూడా చెప్పడంతో సైబర్‌నేరగాళ్లు రూ. 2.03 లక్షలు స్వాహా చేశారు.

రేపు మద్యం దుకాణాలు బంద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): హనుమాన్ జయంతి సందర్భంగా 23న శోభాయాత్ర వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శోభాయాత్ర సాగే మార్గాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. మరోవైపు హనుమాన్ జయంతిని పురస్కరించుకొని.. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసి వేయాలని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కల్లుదుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు మూసి వేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాంపల్లిలో కారు బీభత్సం

ఇద్దరికి తీవ్ర గాయాలు

కీసర, ఏప్రిల్ 21: కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి, బీభత్సం సృష్టించింది. ఈ ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలోని రాంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాంపల్లిలోని ఆర్ఎల్‌నగర్‌లో శనివారం అర్ధరాత్రి ఇకో కారు అతివేగంగా వచ్చి.. మెయిన్ రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో కారులో ఉన్న కార్తీక్ భరద్వాజ్. కౌశిక్ భరద్వాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

విద్యుత్ స్తంభం పూర్తిగా విరిగిపోయింది. ఈ ప్రమాదం తెలుసుకున్న కీసర పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని.. జేసీబీ సహాయంతో కారుపై పడిపోయిన స్తంభాన్ని తొలగించా. కారులో చిక్కుకున్న ఇద్దరిని కూడా బయటకు తీసి, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.